నవతెలంగాణ
సమున్నత తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

వివరాల నమోదుకు మరో అవకాశం

నవతెలంగాణ-నిర్మల్



కుల సర్వేలో పాల్గొనని వారు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకునేందుకు నేటి నుంచి ఈనెల 28వ తేదీ వరకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ తమ గ్రామపంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో, పట్టణ ప్రాంత ప్రజలు మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజా పాలన కేంద్రాలలో తమ వివరాలను సంబంధిత ఫారములలో నింపి అధికారులకు అందజేయవచ్చునన్నారు. సర్వేలో పాల్గొనని వారు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సర్వేపై సందేహాలుంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు 63056 46600ను సంప్రదించాలన్నారు.

సాంప్రదాయ బద్ధంగా హీరాసుక జయంతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ప్రధాన్ సంఘం ధర్మ గురువు హీరాసుక జయంతిని ఆదివారం మండల కేంద్రంలో సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. వారి ఆచార సాంప్రదాయ ప్రకారం వాయిద్యాలను వాయిస్తూ నైవేద్యాన్ని సమర్పించారు. మహిళలు, పురుషులు సంయుక్తంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ హీరాసుక అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామపటేల్ జ్ఞానేశ్వర్, సోయం రామ్‌దాస్, మెస్రం కేశవ్, కనక సంతోష్, మడావి విశ్వనాథ్, గేడం భారత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని అర్లి(టి) జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. 2005-06 బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని విద్యార్థులు 20 ఏండ్లు పూర్తి కావడంతో గురువులతో కలిసి ఒక చోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. వారివారి కుటుంబ సభ్యుల యోగా క్షేమాలు ఒకరినొకరు అడిగి తెలుసుకొని ఆటపాటలతో అలరించారు. అంతకు ముందు గురువులు, విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురువులను శాలువా మెమోంటోలతో ఘనంగా సత్కరించి గురువులకు పాదాభివందనాలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు భారతి, మల్లయ్య, ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, ఉపాధ్యాయులు రామకృష్ణ, మహేష్, సుదర్శన్‌గౌడ్, సరోజ, రమేష్‌రెడ్డి, విద్యార్థులు మహేందర్, రమాకాంత్, లతీఫ్, మహేష్, మచ్చేందర్, పుష్పలత, లత, సవిత, నవనీత పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచు వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన కలకుంట్ల రాము కూతురు వివాహానికి దాతలు ఆర్థిక సాయం అందించారు. అంబారిపేట్ మాజీ సర్పంచ్ మెరుగు సురేఖ ఇంద్రసేనారెడ్డి రూ.5వేలు, మానవసేవే మాధవసేవ ఫౌండేషన్ ఫౌండర్ శెట్టిపల్లి మహేందర్ రూ.5 వేలు, మెరుగు ప్రదీప్ రెడ్డి, ప్రణయ్ రెడ్డి యూఎస్ఏ రూ.5వేలు,పెద్దూరి గణేష్ యూఎస్ఏ రూ.5116 మొత్తం రూ.20116ను ఇంద్రసేన క్రికెట్ యూత్ అసోసియేషన్ సభ్యులు కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, జక్కుల శ్రీనివాస్, కొప్పుల రమేష్, తాటికొండ వెంకటేష్, నర్ర వెంకటేష్, నర్ర రవి, వేల్పుగొండ లింగన్న, వేల్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

షాట్ సర్క్యూట్‌తో మక్కా పంట దగ్ధం



నవతెలంగాణ-బోథ్

మండలములోని కన్గుట్ట గ్రామానికి చెందిన తోట లింగయ్య రైతుకు చెందిన మక్కా పంట దగ్ధం అయింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం సమయంలో చేనులో ఉన్న విద్యుత్ తీగలు అంటుకొని షాట్ సర్క్యూట్‌తో నిప్పులు చెలరేగి రెండు ఎకరాల మక్కా పంట దగ్ధం అయింది. దీంతో ఇచ్చోడ అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చి మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

రేపు పట్టుబడ్డ ఇసుకకు వేలం పాట

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

నిర్మల్ రూరల్ తహసీల్దార్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచి పట్టుబడ్డ ఇసుకను సోమవారం వేలం వేస్తున్నట్లు రూరల్ తహసీల్దార్ సంతోష్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈనెల 11న మంజులాపూర్‌లో 35 ఇసుక ట్రాక్టర్లు పట్టు బడ్డాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రూ.2 వేల రుసుము చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాబాసాగర్, డబ్బా గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు ఎస్సై ఇస్లావత్ నరేష్ సిబ్బందితో కలసి ఆదివారం పేకాటస్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 16 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.4500 నగదు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడినట్లు తెలిస్తే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఖైరిగూడ గ్రామంలో జగదాంబ దేవి మేరమా యాడి సేవాలాల్ మహారాజ్ మందిరం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం హోమం అనంతరం పూజాలు చేసి అన్నదానమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయక్ సుబ్బారావు, గ్రామ కారోబరి చవాన్ ఇందల్, డవ్ గణపతి, రమేష్, ఆలయ పూజారి వసంతరావు, శంకర్, రవీందర్, శివాజీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బరి..విజయంపై గురి..!

- ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న రాజకీయ పార్టీలు
- గెలుపు కోసం సర్వశక్తులొడ్డుతున్న స్వతంత్ర అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న ఎన్నికల ప్రచారం
- పట్టభద్రుల స్థానంలో 56మంది.. ఉపాధ్యాయ బరిలో 15మంది
- ఈ నెల 27న పోలింగ్..మార్చి 3న కౌంటింగ్
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం

శాసనమండలి ఎన్నికల నిర్వహణకు సమయం దగ్గర పడుతోంది. ఇప్పటికే నామినేషన్ల క్రతువు పూర్తికావడంతో బరిలో ఉండే అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. దీంతో బరిలో నిలిచిన అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలు సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. తమ పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. మరోపక్క స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగిన వారు సైతం గెలుపే ధ్యేయంగా ప్రచారం నిర్వహిస్తుండటంతో ఎమ్మెల్సీ ఎన్నికల వాతావరణం వేడెక్కింది. మరో పది రోజుల్లో పోలింగ్ ఉండటంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ముమ్మర ప్రచారం చేపడుతున్నారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ పట్టభద్రుల స్థానంలో 56మంది పోటీ పడగా.. ఉపాధ్యాయ స్థానం కోసం 15మంది పోటీ పడుతుండటం ఆసక్తికరంగా మారింది. ఈ నెల 27న పోలింగ్ నిర్వహించనుండగా.. మార్చి 3న లెక్కింపు చేపట్టనున్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఇప్పుడంతా ఎమ్మెల్సీ ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు మరికొద్ది రోజులు సమయం పట్టే అవకాశం ఉందని ప్రభుత్వవర్గాలు చెబుతుండటంతో ఇప్పుడు జనం దృష్టి అంతా ఎమ్మెల్సీ ఎన్నికలపైనే పడింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం కోసం జరుగుతున్న ఈ ఎన్నికలపై ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టిసారించాయి. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ అభ్యర్థుల విజయంపై దృష్టిసారించాయి. కాంగ్రెస్ నుంచి వుట్కూరి నరేందర్‌రెడ్డి పోటీ పడుతుండగా..బీజేపీ నుంచి అంజిరెడ్డి బరిలో నిలిచారు. బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణ, డీఎస్పీ నుంచి మందజ్యోతితో పాటు మరికొంత మంది అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీల తరపున బరిలో నిలిచారు. మిగితా అనేక మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. ఆయా పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్ధతుగా పార్టీలకు చెందిన కీలక నాయకులు రంగంలోకి దిగారు. సభలు, సమావేశాలు నిర్వహిస్తూ పట్టభద్రులను ఆకర్షించే ప్రయత్నం చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. మరోపక్క స్వతంత్రులుగా బరిలో దిగిన అభ్యర్థులు సైతం ప్రచారాన్ని ముమ్మరం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



ప్రచారం ముమ్మరం..!

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న పోలింగ్ జరగనుండగా.. ప్రచారానికి సమయం మరికొన్ని రోజులు సమయం మాత్రమే మిగిలి ఉంది. నాలుగు జిల్లాల పరిధిలో 42 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వీటి పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 3,59,672 ఓటర్లు ఉన్నారు. 56మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి అభ్యర్థులు ప్రచారాన్ని మరింత వేగం పెంచారు. ప్రత్యక్ష పర్యటనలతో పాటు సోషల్ మీడియాలోనూ విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. పట్టభద్రు ఓటర్లకు సంక్షిప్త సందేశాలు, స్వయంగా ఫోన్లు చేయిస్తూ తమ అభ్యర్థికి మద్దతు తెలుపాలని అభ్యర్థిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లకు పిలుపునిస్తున్నారు.

ఉపాధ్యాయుల విస్తృత ప్రచారం..!

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 15మంది పోటీ చేస్తున్నారు. నాలుగు జిల్లాల పరిధిలో 28,714మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. వివిధ సంఘాల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్ధతుగా ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఆయా సంఘాలు మద్ధతిస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎవరు గెలిస్తే ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుందో.. తెలియజేస్తూ ప్రచార మాధ్యమాలు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఉపాధ్యాయ ఓటర్ల ఇంటికి వెళ్తూ తమకు మద్ధతు తెలియజేయాలని కోరుతున్నారు. తమ మద్ధతుదారులకు అనుకూలంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. దీంతో ఎవరు గెలుస్తారోనని తాజా ఎన్నికల పట్ల ఉపాధ్యాయవర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది. జిల్లాకు చెందిన కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇతర జిల్లాకు వెళ్లి మరీ ప్రచారం చేపడుతుండటం ఆసక్తికరంగా మారింది. మరోపక్క ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు కేటాయింపు పూర్తిచేయగా..అధికారులు, సిబ్బంది నియామకాన్ని సైతం పూర్తిచేసింది.

మీ పిల్లలు అయితే ఇలా చేయిస్తారా..?

- పిల్లలతో వెట్టి చాకిరి చేయిస్తున్న వార్డెన్
- అధికారుల పర్యవేక్షణ కరవు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైనం

నవతెలంగాణ-తలమడుగు

ప్రభుత్వం పేద విద్యార్థులకు అన్ని రకాల వసతులతో పాటు భోజనం, నాణ్యమైన విద్య అందించడానికి వసతి గృహాలను ఏర్పాటు చేసింది. అయితే కొందరు వార్డెన్‌ల కారణంగా వసతిగృహాల లక్ష్యాలు నీరుగారుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమేనని చెప్పొవచ్చు. మండలంలోని ఓ వసతి గృహంలో వార్డెన్ విద్యార్థులతో వెట్టి చాకిరి చేయిస్తున్న ఘనట వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోనిబీసీ బాలుర వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు కొన్ని సంవత్సరాల నుండి వంట మనిషి (కుక్) అనారోగ్యంతో విధులకు హాజరవడం లేదు. అదే విధంగా కామటి ఆరు నెలల కింద ఉద్యోగ విరమణ పొందడంతో విద్యార్థుల గదులతో పాటు బయట చీపురు పట్టి విద్యార్థులతో వార్డెన్ వెట్టి చాకిరి చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రయివేట్ వ్యక్తులతో వంటలు వండటం వండిన గంజులను శుభ్రం చేయిస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. అనుకోని సంఘటన జరిగితే సంబంధిత శాఖ అధికారులు ఎవరిపై చర్యలు తీసుకుంటారనే ప్రశ్నాలు వ్యక్తం అవుతున్నాయి. అప్పుడప్పుడు మెనూ పాటించక పోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం కూడా సక్రమం అందడం లేదు. ప్రభుత్వ వసతి గృహాలకు ప్రభుత్వమే టెండర్లు పిలిచి కూరగాయలు సరఫరా చేయాల్సి ఉండగా వార్డెన్ స్వయంగా కూరగాయలు తీసుకురావడం అంతర్యం ఏమింటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వార్డెన్ మండలంలోని ఒక గ్రామానికి చెందిన వాడు కావడంతో



ప్రతినిత్యం అక్కడి నుండే రాకపోకలు కొనసాగిస్తుంటాడు. నెల రోజులలో అప్పుడప్పుడు రాత్రులలో తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు. ప్రతిరోజు రాత్రి 8 గంటలకు వసతి గృహం నుండి తన సొంత ఊరికి వెళ్లడంతో విద్యార్థులు రాత్రివేళల్లో చదువుతున్నారా బయట తిరుగుతున్నారా పర్యవేక్షణ లేకపోవడం, విద్యార్థుల చదువు ఎలా కొనసాగుతుందని అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏదైనా శాఖ అధికారులు వసతి గృహానికి తనిఖీలకు వస్తే అన్ని సక్రమంగా ఉన్నాయని చెప్పాలని విద్యార్థులకు ముందుగానే బోధించి ఉంచుతారని తెలిసింది. హాస్టల్ సమాచారాన్ని బయటకు ఎవరికి చెప్పవద్దని అన్ని మంచిగానే ఇస్తున్నారని చెప్పాలని విద్యార్థులకు భయంభ్రాంతులకు గురిచేస్తున్నట్టు సమాచారం. వసతి గృహాలపై మండల జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వార్డెన్ తమ వృత్తి ధర్మాన్ని నెరవేర్చలేక పోతున్నారనే విమర్శలు కూడా ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

మోసం చేసే నకిలీ బాబాలను నమ్మొద్దు : డీఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమాయక ప్రజలను మాయమాటలు చెప్పి మోసం చేసే నకిలీ బాబాలను నమ్మొద్దని డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. ఇటీవల ఖుర్షీద్ నగర్‌కు చెందిన అజరోద్దీన్ ఇలానే బాబా మాటల్లో మోసపోగా కేసు నమోదు చేశారు. కాగా ఆదివారం టూటౌన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ కరుణకర్ రావ్, ఎస్సై విష్ణుప్రకాష్‌తో కలిసి కేసు వివరాలను తెలియజేశారు. పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌కు చెందిన అజరోద్దీన్‌కు బంగారుగూడకు చెందిన యాసిన్ ఉర్ఫ్ జనాబ్‌తో జనవరిలో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వారి ఇంట్లో సమస్య ఉందని బాబాకు అజరోద్దీన్ తెలిపాడు. సమస్య పరిష్కారంతో పాటు ఇబ్బందులు తొలుగుతాయని బాబా అతనితో చెప్పుకొచ్చాడు. బాబాను నమ్మిన అజరోద్దీన్ రూ.5,600 తాయిత్తుల కోసం ఇచ్చాడు. బాబా పుర్రె బొమ్మల పేపర్‌లో ఏవో అక్షాలు రాసీ ఇచ్చారు. 45 రోజుల పాటు దిండు కింద వాటిని పెట్టుకోవాలని సూచించాడు. బాబా చెప్పిన విధంగా ఇంట్లో పెట్టుకున్నాడు. కొన్ని రోజుల తరువాత వింతగా ప్రవర్తిండంతో భార్య, తల్లి ఇద్దరు అతన్ని వదిలి వేరే చోటకు వెళ్లిపోయారు. బాబా ఇచ్చిన తాయిత్తులతో తనకు ఇబ్బంది కలుగుతుందని బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేయడంతో యాసిన్‌పై కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి బంగారుగూడలోని బాబా ఇంటిని సోదాలు చేయగా వింతైన వస్తువులు లభించాయని, ఏ రోగానికి ఏ మంత్రం వేయాలో అందులో రాసి ఉందని డీఎస్పీ చెప్పారు. దీంతో బాబాకు నోటీసులు అందించామని పేర్కొన్నారు. ప్రజలు కూడా మూఢనమ్మకాలపై విశ్వాసం పెంచుకోవద్దని, ఏదైనా ఆరోగ్య సమస్యల ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. నకిలీ బాబాల గురించి ప్రజల వద్ద సమాచారం ఉంటే అందించాలని, అలాంటి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

జిల్లాలో ముగిసిన ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్

- 20 కేంద్రాలలో పరీక్ష నిర్వహణ
- 4వేల మంది విద్యార్థుల హాజరు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదో తరగతి విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షించే ఉద్దేశంతో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయిక్రిష్ణలు మాట్లాడుతూ పది విద్యార్థులను రానున్న పరీక్షలకు సిద్ధం చేసే ఉద్దేశంతో టాలెంట్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షకు విద్యార్థుల నుండి మంచి స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. పరీక్షల పట్ల విద్యార్థులకు ఉన్న భయాన్ని దూరం చేయడంతో పాటు మరింత నిష్ణాతులను చేయడమే తమ లక్ష్యం అన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 20 సెంటర్లలో 4000 మంది విద్యార్థులు పరీక్ష రాసారని వీటికి సంబంధించిన ఫలితాలను విడుదల చేసి బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జిల్లా పేరు



తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ గెడం టీకానంద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని చాందా(టి) బెల్లూరి గ్రౌండ్‌లో జోగు ఆశన్న భోజమ్మ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుకు మాజీ మంత్రి జోగు రామన్న బహుమతులను అందించారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో జాన్వి వర్సెస్ న్యూ స్టార్ తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన న్యూస్టార్ 150 పరుగులు సాధించింది. జాన్వి 137 పరుగులు చేసి ఓటమిపాలైంది. క్రీడాలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులతో పాటు ప్రథమ, ద్వితీయ జట్లకు మెడల్స్, నగదును అందించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ ప్రతి ఏటా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసే ప్రయత్నంలో జోగు ఫౌండేషన్ ముందుంటూ క్రీడాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. అంతే కాకుండా ప్రతి గ్రామంలో వాలీబాల్, క్రికెట్, షటిల్ క్రీడాకారులను ప్రోత్సహిస్తు వారికి అండగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ ఆటలను ఆస్వాదిస్తూ ఉన్నత స్థాయికి ఎదిగేలా ముందుకు సాగాలని సూచించారు. అదే విధంగా ఏసీఎల్ నిర్వాహకులు పోటీల నిర్వహణకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యూనిస్ అక్బాని, సాజిదోద్దిన్, బట్టు సతీష్ దేవదాస్, భానుకర్ ప్రమోద్, అయూబ్, అద్నన్, ఓం ప్రకాష్. జమిలి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌లో ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకట్ కోరారు. ఆదివారం వెంకట్ ఆధ్వర్యంలో ఉదయం వాకర్ అసోసియేషన్స్, టీ క్యాంటీన్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేస్తూ ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు సూర్యకుమార్, జిల్లా కార్యదర్శులు విలాస్ రావు, గౌస్ మొయినుద్దీన్, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

నవతెలంగాణ-తలమడుగు



బీజేపీ బలపరిచిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని బోథ్ అసెంబ్లీ టీచర్ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి బోండ్ల వెంకటస్వామి కోరారు. ఆదివారం మండలంలోని ఆర్లి(కె) గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్లి(కె) బూత్ అధ్యక్షులు కోరండ్ల పురుషోత్తం, ఎల్టి శ్రీనివాసరెడ్డి, ఆశిష్, విష్ణు, ప్రసాద్, సుదర్శన్, కంది స్వామి, జ్ఞానేందర్, అనీష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-బేల

మండలంలోని కాంగర్‌పూర్ గ్రామ శివారులో పెన్‌గంగా నది వద్ద ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు ఆదివారం ఉదయం జైనథ్ సీఐ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో బేల ఏఎస్సైలు లింగన్న, జీవన్ కుమార్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా నాలుగు ఇసుక



ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడ్డాయి. వాటిని సీజ్ చేసి బేల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్టు జైనథ్ సీఐ తెలిపారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఇసుక మాఫియా పై ఉక్కు పాదం మోపాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని, తెలిపిన సూచనల మేరకు ఇసుక అక్రమ రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు జైనథ్ సీఐ డి.సాయినాథ్ తెలిపారు.

ఘనంగా మాజీ మంత్రి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వారి అభిమానులు క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ మాతా శిశుసంక్షేమ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాలం శ్రీనివాస్, మేడారం ప్రదీప్, పాకాల రామచందర్, రమణారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, పూదరి సాయి, కొప్పుల శ్రీధర్, నిగులపు సంజీవ్, దేవర రఘు పాల్గొన్నారు.



వాహనం వచ్చేలోపే.. కాలి బూడిద

ఏడు మండలాలకు ఒకే ఫైరింజన్



నవతెలంగాణ-ఇచ్చోడ

అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అగ్నిమాపకశాఖ కృషి చేస్తోంది. మండల కేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఒకే ఫైర్ ఇంజన్ అందుబాటులో ఉంది. ఇది ఏడు మండలాల్లోని ఏ అగ్నిప్రమాదం జరిగిన వెళ్లాల్సి ఉంటుంది. బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ, బజార్‌హత్నూర్, సొనాల, బోథ్, నేరడిగొండ, గుడిహత్నూర్, సిరికొండలకు ఒకే ఫైర్ ఇంజన్ వాడుతున్నారు. రెండు చోట్ల ఒకేసారి ప్రమాదం సంభవిస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్న ఒక ఫైర్ ఇంజన్ ప్రమాద స్థలానికి వెళ్తే మరోచోట ప్రమాదం సంభవించినప్పుడు మంటలను ఆర్పేందుకు ఫైర్ ఇంజన్ ఉండదు. అప్పటికే తీవ్రస్థాయిలో ఆస్తి నష్టం కొన్ని సందర్భంలో ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంటుంది. ఇచ్చోడ నుంచి చుట్టుపక్కల మండలాల్లో ఎక్కడైన అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలను ఆర్పేందుకు ఫైర్ ఇంజన్ రావాలంటే కనీసం 30 నిమిషాల నుంచి 55 నిమిషాలు పడుతుంది. ఇటీవల ఇలాంటి సంఘటనలు కూడా జరిగాయి అదే మండలానికి ఒక ఫైర్ ఇంజన్ అందుబాటులో ఉంటే మండలంలో ఏ ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించిన ఐదు పది నిమిషాల్లోనే ప్రమాద స్థలానికి చేరుకోవచ్చు. మంటలను ఆదిలోనే ఆర్పేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. బాధితునికి తక్కువ నష్టం ఉంటుంది.

అగ్నిప్రమాదంలో రూ.8లక్షల నష్టం..

ఇటీవల జనవరి 9న నేరడిగొండ మండలంలోని భూర్కపల్లి గ్రామ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఎల్లీ, ఉల్లిపాయల లోడ్ తో నాగ్‌పూర్ వైపు వెళుతున్న లారికి గురువారం తెల్లవారుజామున మెకానికల్ హీట్టింగ్ ద్వారా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఇచ్చోడ అగ్నిమాపక కేంద్రానికి అర్ధరాత్రి 2 :11నిమిషాలకు సమాచారాన్ని అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, 2:12నిమిషాలకు వెంటనే బయలుదేరారు. 36 కిలోమీటర్ల దూరంలో ఉన్నా భూర్కపల్లి, ఘటన చోటుకు చేరుకోవడానికి 30నిమిషాలు పట్టింది. ఫైరింజన్ వచ్చేలోపు 70 శాతం కాలి బూడిద అయినట్లు స్థానికులు చెబుతున్నారు. రూ.8 లక్షల ఆస్థి నష్టపోయిన బాధితుడు

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం..

రెండు సంవత్సరాల కింద మండల కేంద్రంలోని న్యూ కాలనీలో మీసర్ హైమద్ చెందిన ఇల్లుకు షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ఆనాడు మధ్యాహ్నం 3:15కు కుటుంబ సభ్యులు ఇచ్చోడలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే బయలుదేరి వెళ్లారు. ఇచ్చోడ నుంచి ప్రమాదం చోటు వరకు 30 కిలోమీటర్లు ఉంటుంది. ఫైరింజన్ చేరుకోవడానికి 40 నిమిషాలు పట్టింది. యాభై శాతం పైగా ఇల్లు కాలి బుడిదా కాగా, పూర్తి స్థాయిలో నష్టం పోకుండా అగ్నిమాపక సిబ్బంది కృషి చేశారు. ఈ ప్రమాదంలో రూ.4లక్షల 50 వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు. బోథ్‌లోనే ఫైరింజన్ ఉంటే ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగేది కాదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అగ్నిమాపక కేంద్రం శంకుస్థాపన చేసి ఏడేండ్లు...

బోథ్ మండల కేంద్రంలో పిప్పల్‌ధరి గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రక్కన సర్వే నెంబర్ 262లో 20 గుంటలు భూమిని కేటాయించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, 20 మార్చి 2018 నాడు ప్రజా ప్రతినిధులు, స్థానిక అధికారులు శంకుస్థాపన చేసి నేటికి ఏడేండ్లు గడుస్తున్నా అక్కడ పనులు ప్రారంభించక పోవడంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అదనంగా రెండు కిలోమీటర్ల ప్రయాణం...

అగ్నిమాపక కేంద్రం కార్యాలయం ఎదుట 44వ జాతీయ రహదారి ఉంది. అక్కడ ఎగ్జిట్ ఇవ్వకపోవడంతో బోథ్, నేరడిగొండ, సొనాల, సిరికొండ వైపు వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం ఉన్న జున్నీ గ్రామ క్రాస్ వరకు వెళ్లి యూటర్న్ తీసుకోవడం వల్ల 5నిమిషాలు పటుతోంది.

ఏ సమయంలోనైనా అప్రమత్తంగా ఉంటున్నాం



మా పరిధిలో 7 మండలాలు వస్తాయి. నూతనంగా ఏర్పడిన సొనాల, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, బోథ్ నేరడిగొండ, గుడిహత్నూర్, సిరికొండ మండలాల్లో ఎక్కడ అగ్నిప్రమాదం సంభవించిన, సమాచారం అందుకున్న వెంటనే ఆలస్యం చేయకుండా ప్రమాదం జరిగిన స్థలానికి వెళ్తున్నాం. కొన్ని మండలాలకు కనీసం ప్రయాణం 40 నుంచి 50నిమిషాలు పడుతోంది. ఆ సందర్భంలో కొంత మేర నష్టం జరుగుతోంది. వీలైనంత త్వరలో సంఘటన స్థలానికి వెళ్లి ఆస్థి, ప్రాణ నష్టం జరగకుండా ప్రయత్నం చేస్తున్నాం.

అశోక్ అగ్నిమాపక అధికారి, ఇచ్చోడ



అరుదైన శస్త్ర చికిత్స.. ప్రాణాలు కాపాడిన వైద్యులు..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎలాంటి లక్షణాలు కనిపించకుండా గుండెపోటు వచ్చిన ఓ వ్యక్తికి అరుదైన శస్త్ర చికిత్స చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడినట్లు సోమాజిగూడ యశోద హాస్పిటల్ కార్డియాలజిస్ట్ పంకజ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని గజానన్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని, వివరాలు తెలియచేశారు. ఇంద్రవెల్లికి చెందిన రాజు అనే వ్యక్తికి లక్షణాలు లేకుండానే గుండె పోటు వచ్చిందన్నారు. నెలన్నర కిందగా విరేచనాలతో ఆస్పత్రికి వచ్చారని తెలిపారు. పలు విధానాల్లో వైద్యం అందించిన ఆయనకు బీపీ ఎక్కువ కావడం లేదని గమనించారన్నారు. తర్వాత 2డీ ఈకో తీయగా రక్తనాళాలు మూసుకుపోగా గుండెపోటు వచ్చినట్లు గుర్తించామన్నారు. పలు పరీక్షలు చేయగా ఈ విషయం బయటపడినట్లు వెల్లడించారు. ముందుగా గజనన్ హాస్పత్రిలో చికిత్స చేసిన అనంతరం తమ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. యశోద ఆస్పత్రిలో అత్యంత అరుదుగా నిర్వహించే శస్త్ర చికిత్స చేసి బాధితుడి ప్రాణాలు కాపడినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన క్షేమంగా ఉన్నారని డిశ్చార్జ్ చేశామన్నారు. బీపీ తక్కువ అయినా గుండెలో నొప్పి అనిపించినా ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలని సూచించారు.

జిల్లాలో ఉషా బాలికల రాష్ట్రస్థాయి పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్


జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని సేట్జియంలో ఈనెల 18, 19 తేదీల్లో ఉషా బాలికల రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్టు గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో స్టేట్ మీట్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా గిరిజనర క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి మాట్లాడుతూ ఖేలో ఇండియాలో భాగంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉషా బాలికల రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. 33 జిల్లాల నుంచి క్రీడాకారులు ఆదిలాబాద్ కు వస్తారన్నారు. రెండు రోజుల పాటు స్టేడియంలో జరిగే పోటీలను తిలకించేందుకు ప్రజలు వచ్చి క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. అదే విధంగా క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉషా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉషా సంఘం అర్గనైజింగ్ చైర్మెన్ విరేష్, శృతి, పేట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికుమార్, హ్యాండ్ బాల్ కార్యదర్శి నడిమేల హరిచరణ్, మాధవి, వనిత, దివ్య, కాజల్, దుర్గా పాల్గొన్నారు.

మహ్మదీయ దారుల్ ఉలూమ్ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని భుక్తపూర్‌లోని మహ్మదీయ దారుల్ ఉలూమ్ మదర్సా 52వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఈద్గామైదానంలో ఘనంగా నిర్వహించారు. మదర్సాలో దివ్య ఖురాన్ కంఠస్థం చేసిన పది మంది విద్యార్థులను సత్కరించి, అభినందనలు తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా ఆధ్యాత్మిక వేత్తలు జహీరాబాద్‌కు చెందిన అతీక్ అహ్మద్ ఖస్మి, ఇండియాన్ పర్సనల్ లాబోర్డు సభ్యుడు జునైద్ ఉర్‌రహ్మాన్ ఆజాది ఖస్మీ హాజరయ్యారు. దివ్య ఖురాన్ కంఠస్థం పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు మెమెంటోలను అందించారు. అంతకు ముందు మదర్సా ప్రతినిధులు మౌలన షేక్ అహ్మద్ రంజానీ మదర్సాలో బోధన పరమైన అంశాలతో పాటు పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సెల్ వాడకంపై చేసిన నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో నిర్వాహకులు షాహిద్ అహ్మద్ తవక్కల్, మౌలన ఇస్లామోద్దీన్, మసూద్ పటేల్, ఆరీఫ ఖాన్ పాల్గొన్నారు.

మల్లన్న దేవుని హుండీ లెక్కింపు



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలోని మల్లన్న దేవుని హుండీ లెక్కింపు ఆదివారం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో చేపట్టారు. శనివారం దేవుని జాతర ముగిసింది. ప్రతి సంవత్సరం దేవుని జాతర జరిగిన తర్వాతనే ఈ ఉండి లెక్కింపు చేస్తారు. నగదు రూ.5లక్షల 3వేల 920తో పాటు బియ్యం, బెల్లం, మిశ్రమ వెండి 42.5 తులాలు, మిశ్రమ బంగారం 7మాసాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు ఆశన్న, అశోక్, నాయకులు, గ్రామస్తులు సాయంరెడ్డి, గంగారెడ్డి, దత్తాత్రి, రవీందర్‌రెడ్డి, విఠల్ యాదవ్, గురుప్రసాద్ యాదవ్, నిమ్మ పోతన్న, మానిక్‌రెడ్డి, గంగారెడ్డి, ముత్యంరెడ్డి, సుంక రాములు, భూమన్న, కండెల సాయినాథ్, గంగాధర్, నల్ల విఠల్‌రెడ్డి, సుధాకర్, ప్రవీణ్‌రెడ్డి, రాజన్న, దిగంబర్ పాల్గొన్నారు.

రీసెర్చ్ అసోసియేట్ సైంటిస్ట్‌గా చౌహన్ అకాష్

నవతెలంగాణ-నార్నూర్



రీసెర్చ్ అసోసియేట్ సైంటిస్ట్‌గా చౌహన్ అకాష్ ఉద్యోగం సాధించడం పట్ల మండలంలోని మహాగావ్ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని మహాగావ్ గ్రామానికి చెందిన చౌహాన్ ప్రహ్లాద్ జిజాబాయి పెద్ద కుమారుడు చౌహాన్ ఆకాశ్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో సన్నద్ధమయ్యాడు. పది రోజుల కింద హైదదాబాద్‌లోని చర్లపల్లిలో సెంట్రల్ లెవల్ సీమెట్‌లో రీసెర్చ్ అసోసియేట్ సైంటిస్ట్‌గా ఉద్యోగం సాధించాడు. ఈయన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మంచి ర్యాంక్‌తో మేటిరియల్ ఇంజినీరింగ్‌లో ఐదు సంవత్సరాలుగా రీసెర్చ్ చేసి పది రోజుల కింద హైదరాబాద్‌లో సీ మెట్‌లో రీసెర్చ్ అసోసియేట్ సైంటిస్ట్‌గా రూ.83వేల వేతనంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం పొందాడు.

నాన్న ప్రోత్సాహంతో ఉద్యోగం..

నాన్న ప్రత్సహంతోనే చదువులో రాణించాను. చదువులో ఉన్న మక్కువను గుర్తించిన నాన్న నాకు చదువులో ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా చదివించారు. నాన్న కష్టాన్ని గుర్తించి, పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాను. నాన్న కలలను నిజం చేశా.

ఘనంగా డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పట్టణంలోని భాగ్యనగర్ డీసీసీ క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావు జన్మదిన వేడుకలను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు, మహిళలకు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, పట్టణాధ్యక్షులు నందేడపు చిన్ను, మున్సిపల్ మాజీ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, వివిధ మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు ఎంబడి రాజేశ్వర్, గండి రామన్న, సాయి బాబా ఆలయ కమిటీ చైర్మెన్ గంగోని భూరాజ్, దేవరకోట దేవస్థాన ఆలయ కమిటీ చైర్మెన్ కొండ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ వాజిద్ అహ్మద్ ఖాన్, మాజీ జిల్లా జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు అతీక్ అహ్మద్, మజర్, సభ కలీం, మాజీ కౌన్సిలర్ అయ్యన్నగారి పోశెట్టి, కొట్టే శేకర్, సందీప్, జిషాన్, ఈటల శ్రీనివాస్, సింధియా సోమేష్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మోర విఠల్ జన్మదిన వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టిన రోజును పురస్కరించుకొని రిమ్స్‌లో మానవసేవే మాదవ సేవ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ముందుగా కేక్ కట్ చేసి తినిపించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోగి సహయకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ ఆడప తిరుపతి, మాజీ ఎంపీటీసీ లోక భీంరెడ్డి, ఫైర్ అధికారి దుర్గం శివాజీ, గ్రామస్తులు గంగారాం, విఠల్, ప్రభాకర్, యశ్వంత్, నారాయణ, సంజీవ్, ఆశన్న, విఠల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-నేరడిగొండ

బోథ్ బీజేపీ మండలాధ్యక్షుడు సాబ్లే సంతోష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు ఆయన అనుచరులు దాదాపు 100 మంది ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాబ్లే సంతోష్ మాట్లాడుతూ కార్యకర్తలను గుర్తించడంలో బీజేపీ విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు తిరగపడుతున్నారని, ఇక తెలంగాణ రాష్ట్రాన్ని మంచి చేయాలనే ఉద్యేశంతో ఉన్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలను గుర్తిస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్, ప్రజలపై చేస్తున్న అరాచకాలను స్థానిక సంస్థల్లో ప్రజలకు చూపాలని అన్నారు. పార్టీలో చేరిన వారిలో సాబ్లే సంతోష్ సింగ్, బాక్రె లక్ష్మణ్, రబడే జగదీష్, ఉడుగుల అభిలాష్, బోగి రాజేందర్, మెస్రం గంగా ప్రసాద్, బొంతుకుల శ్రీను, సిరా నగేష్, బాక్రె సురేష్, బాక్రె కృష్ణ, బోదాసు శంకర్, తగరే సుందర్ సింగ్, బాక్రె ప్రేమ్, చిలకాడి పురుషోత్తం, సాబ్లే గణేష్, కటక్ వాల్ ఉత్తమ్, మహాదు, ఆత్రం శంకర్, ధనరాజ్, కృష్ణ, సంతోష్, రోహిదాస్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్, బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నవతెలంగాణ-కడెం

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టపన మహోత్సవంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా శివరాత్రి మహోత్సవాలకు సంబంధించిన గొడపత్రులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, లింగాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల బాలవ్వ లచ్చన్న, కాంగ్రెస్ నాయకులు కోల శ్రీనివాస్, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బోసిపోయిన చికెన్ షాపులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముక్క లేనిదే ముద్ద దిగని పరిస్థితులు ఉన్నాయి. కాని బర్డ్‌ఫ్లూ కారణంగా కొనుగోలుదారులు లేక ఆదివారం చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి. బర్డ్‌ఫ్లూ భయంతో జనాలు చికెన్ తినేందుకు జంకుతున్నారు. ఎక్కడ వ్యాధి తమకు వస్తుందోనని భయంతో తినడం లేదు. కొన్ని రోజులుగా సోషల్ మీడియా, వార్తల్లో బర్డ్ ఫ్లూపై వస్తున్న కథనాలతో వ్యాపారం జరగడం లేదని చికెన్ దుకాణాల యాజమనులు వాపోతున్నారు. ఆదివారం వచ్చిందంటే రద్దీగా కనిపించే పలు చికెన్ షాపుల్లో ఇప్పుడు గిరాకీలు లేకుండా బోసిపోయినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉంటే ప్రభుత్వం కూడా అలర్ట్ అయి జిల్లాల సరిహద్దులో పౌల్ట్రీ, బ్రైలర్ కోళ్ల రాకుండా ప్రత్యేక చెకోపోస్టులను ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ లేదని, అయిన అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులు చెబుతున్నా ప్రజలు మాత్రం చికెన్ తినేందుకు జంకుతున్నారు.

వ్యాపారం సాగడం కష్టం..

కాగా పలువురు వ్యాపారులు మాట్లాడుతూ ప్రతి ఆదివారం తమ గిరాకీ బాగుంటుండేదని తెలిపారు. కానీ బర్డ్‌ఫ్లూ కారణంగా చాలా మంది చికెన్ కొనుగోళు చేయడం లేదన్నారు. దీంతో వ్యాపారం సాగడం కష్టంగా మారిందన్నారు. కొన్ని సందర్భాల్లో అయితే వర్కర్లకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ఏపీ, ఇతర రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ ప్రభావం ఉందన్నారు. కానీ తాము లోకల్ ఫాం నుంచి కోళ్లను తీసుకువస్తున్నామని తెలిపారు. తాము కూడా రోజు చికెన్ తింటున్నామని, ఫ్లూ లక్షణాలు ఇక్కడ లేవన్నారు.

తాంసి : ఎప్పుడు చికెన్ సెంటర్లు, చికెన్ తినే వినియోగదారులతో కిక్కిరిసి ఉండేవి, కానీ బర్డ్‌ఫ్లూ వైరస్ భయంతో ఆదివారం ఎ చికెన్ సెంటర్లు చూసిన చికెన్ వినియోగదారులు చికెన్ సెంటర్‌ల వైపు కన్నెత్తి చూడకపోవడంతో సెంటర్‌లో చికెన్ కొనేవారు లేక వేలవేల బోయాయి. ఎటు చూసినా మటన్, చేపలు, తినడానికే మొగ్గు చూపుతున్నారు. చేపల డిమాండ్ పెరగడం వినియోగదారుల జేబులు ఖాళీ అవుతున్నాయి. మన రాష్ట్రంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ అంతగా లేకపోయినప్పటికీ చుట్టుపక్కల మహారాష్ట్ర ప్రాంతాల్లో వైరస్ ఉన్నట్లు తెలవడంతో మహారాష్ట్ర పౌల్ట్రీ ఫారాల నుంచి మన ప్రాంతానికి తీసుకు వస్తారు. మహారాష్ట్ర నుంచి తీసుకు వస్తారనే భయంతో చికెన్ కొనడానికి ప్రజలు జంకుతున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని సోమిని గ్రామంలో భోగముండకు చెందిన పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. అక్రమంగా నిలువ ఉంచినట్లు వచ్చిన సమాచారం వేరకు తనిఖీ నిర్వహించారు. ఇక్కడ 5 క్వింటాళ్ల బియ్యం భోగముండ ఇంట్లో లభించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు బియ్యాన్ని స్వాధీనపరచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాచారం ఉంటే పోలీసులకు ఇవ్వాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని సాలెగూడా గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ రవీందర్ తెలిపారు. సాలెగూడ గ్రామ శివారులో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం సాలెగూడ గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3020 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా ఆసిఫాబాద్ మండలంలో ఎక్కడైనా పేకాట ఆడినట్లు తెలిస్తే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అదే విధంగా ఎవరైన అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారని వివరించారు. అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

ప్రశాంతంగా సీఓఈ ప్రవేశ పరీక్ష



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రతిభా కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని పీటీజీ గిరిజన గురుకులంలో మొత్తం 320 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 300 మంది హాజరుకాగా 20 మంది గైర్హాజరైనట్లు, గిరిజన బాలికల కళాశాలలో 245 మందికి 221 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరు అయ్యారని, గిరిజన బాలికల డిగ్రీ కళాశాల లో 320 మందికి 306 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరు అయ్యారని ఆయా సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్‌లు కారం భద్రయ్య, అనిత, తక్షశిలలు తెలిపారు. పీటీజీ గురుకులంలో అబ్జర్వర్‌గా తీర్యాణి కళాశాల అధ్యాపకురాలు సౌమ్య వ్యవహరించారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

శిశుమందిరాలు.. సంస్కృతికి నిలయాలు

- అట్టహాసంగా పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సరస్వతి శిశుమందిరాలు సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, శిశుమందిర్ విద్యాపీఠం దక్షిణ మధ్య క్షేత్రం సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 1979-2024 శిశుమందిర్ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి వికసించాలంటే చదువుతో పాటు సంస్కృతి, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఇవన్నీ ఒక్క సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో దొరుకుతుందన్నారు. మాజీ జడ్పీటీసీ అరిగేలా నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ పిల్లలు శిశు మందిర్‌లో చదివి విదేశాల్లో స్థిరపడి మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. ముందుగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్వాగతం పలికారు. అనంతరం గురువులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. నాలుగు దశాబ్దాల నుంచి శిశు మందిరాల్లో చదువుకుంటున్న పూర్వ విద్యార్థులు ఒకే చోటికి చేరుకొని ఆత్మీయ పలకరింపులు, ఆలింగనం తర్వాత చిన్ననాటి మధురస్మృతులు, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముఖ్యంగా ఈ మహా సమ్మేళనంలో పాల్గొనేందుకు అమెరికా నుంచి గోపికృష్ణ అనే పూర్వ విద్యార్థి పాల్గొనడం విశేషం. వేదికపై చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. బ్యాచుల వారీగా వేదిక వద్ద ఫోటోలు దిగడానికి పూర్వ విద్యార్థులు మక్కువ చూపించారు. కార్యక్రమంలో శిశుమందిర్ పాఠశాల పూర్వ విద్యార్థి పరిషత్ నాయకులు బొడ్డు శ్రీనివాస్, రాజరెడ్డి, పాఠశాల అధ్యక్షుడు చిలువేరు వెంకటేష్, డాక్టర్ విష్ణువర్ధన్ రావు, పాఠశాల ప్రథమ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, బోనగిరి సతీష్, వెంకటేశ్వర్లు, ప్రధాన చార్యులు, ఆచార్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద అనుమతులు లేకుండా తరలిస్తున్న 6 ఇసుక ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని పెద్దవాగు, చిలాటి గూడ వాగుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద 6 ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

శాసన మండలి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజి కోరారు. ఆదివారం కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమరయ్యను గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షులు పుల్ల అశోక్, విజయ్ కుమార్, దొకె రాము అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి రాజేందర్ గౌడ్, ఎల్ములే మల్లయ్య, తిరుపతి గౌడ్, కష్ణ, నానాజీ, రంగన్న, మోహన్, బాబురావు, మంచిర్యాల జిల్లా కార్యదర్శి గోవర్ధన్, సీనియర్ నాయకులు కేశవరెడ్డి పాల్గొన్నారు.

కౌటాల : అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఎమ్మాజి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. శాసన మండలిలో ప్రజల గొంతుక వినిపించాలంటే వీరిని గెలిపించాలని కోరారు. ఇందులో మండల అధ్యక్షులు కుంచాల విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి రాజేందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, మాజీ ఎంపీపీ తిరుపతి గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నీటి కోసం తండ్లాట..

- ఒడ్డుగూడ పంచాయతీ పరిధిలో తీవ్ర నీటి ఎద్దటి
- నిలిచిపోయిన మిషన్ భగీరథ
- గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో సరఫరా

వేసవి ప్రారంభంలోనే నీటి కష్టాలు మొదలయ్యాయి. మిషన్ భగీరథ నీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. సర్పంచ్‌తో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీల పాలన ముగియడంతో ప్రత్యేక పాలన ప్రారంభమైంది. అధికారులకు రెండు నుంచి మూడు, నాలుగు జీపీలకు బాధ్యతలు అప్పగించారు. శాఖ పనులతో పాటు గ్రామాల్లోని సమస్యలను తెలుసుకోవడం వారికి కష్టంగా మారుతోంది. వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఉన్నాధికారులు చెబుతున్న అధికారులు మాత్రం గ్రామాల్లో పర్యటించిన దాఖలు కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని కారణంగా కొన్ని గ్రామాల్లో తాగు నీరు కోసం జనాలు అవస్థలు పడాల్సిన దుస్థితి ఉంది. అధికారులు వేసవి మరింత పెరగకముందే నీటి కష్టాలను దూరం చేయాని కోరుతున్నారు.



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని ఒడ్డుగూడా గ్రామ పంచాయతీలో వేసవికి ముందే తీవ్ర నీటి ఏద్దటి నెలకొంది. అందవెల్లి వద్ద పెద్దవాగు వంతెన అప్రోచ్ రోడ్డు పనులు నడుస్తున్నందున మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో ఒడ్డుగూడ, బ్రాహ్మణ చిచ్చాల గ్రామాల్లో నీటి కోసం జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రోజులుగా సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలో ప్రభుత్వ బోర్లు బావులు లేకపోవడంతో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొంతమంది బోర్లు ఉన్న వ్యక్తుల వద్ద నుండి నీళ్లు తీసుకొచ్చుకుంటూ అవసరాలు తీసుకోగా మరి కొంతమంది ఎడ్లబండ్లలో డ్రమ్ములు పెట్టుకొని సమీప వాగుల్లోంచి నీళ్లను తెచ్చుకొని తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. ప్రజల అవసర కోసం గ్రామపంచాయతీ ట్యాంకర్‌తో ఒకరోజు బ్రాహ్మణ చిచ్చాలలో మరో రోజు ఒడ్డుగూడలో పంచాయతీ వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతోఒక కుటుంబానికి ఒకటి రెండు క్యాన్ల నీరు మాత్రమే దొరుకుతుండడంతో వాటర్ ట్యాంకర్ రాగానే ప్రజలు క్యూ లైన్లు కట్టి నీటిని తీసుకెళు న్నారు. ఇవి కేవలం కొద్దో గొప్ప బయటి అవసరాలు మాత్రమే తీరుస్తుండగా తాగునీటి కోసం సుదూర ప్రాంతాలకెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి ఒడ్డు గూడ బ్రాహ్మణ చిచ్చాల గ్రామాల్లోని నీటి సమస్యలను పరిష్కరించి ప్రజలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు



మిషన్ భగీరథ నీరే ఆధారం

ఒడ్డు గూడలోని ఎస్సీ కాలనీ, బ్రాహ్మణ చిచ్చాలలోని ఎస్సీ కాలనీలో ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఈ రెండు కాలనీలలో బోర్లు బావులు లేకపోవడంతో వారు తాగు నీరు కోసం మిషన్ భగీరథపైనే ఆదారపడుతున్నారు. వంతెన, అప్రోచ్ రోడ్ల మరమ్మత్తుల కారణంగా మిషన్ భగీరథ నీరు సరఫరా నిలిచి పోయింది. దీంతో వీరాకి నీటి కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికైన అధికారులు నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి వారికి కష్టాలను దూరం చేయాలని కోరుతున్నారు.

వైకల్యాన్ని అధిగమించేలా చూడాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మానసిక, మేధో వైకల్యాన్ని పిల్లలు అధిగమించేలా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి లీగల్ సర్వీసెస్ కన్వీనర్ యువరాజ అన్నారు. జిల్లాలో మానసిక, మేధో వైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు అందించే వివిధ రకాల సేవలకు సంబంధించి వివరించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీకి నిర్వహించనున్న రెండు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, జిల్లా వైద్యాధికారి సీతారాంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక, మేధో వైకల్యాన్ని అధిగమించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఇటువంటి వారికి ఉన్న హక్కుల గురించి అవగాహన కల్పించాలన్నారు. న్యాయస్థానాల ద్వారా అనేక రకాల సేవలు అందనున్నట్లు తెలిపారు. వీటిని వివరించడంతో పాటు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కమిటీలపై ఉందన్నారు. ఇటువంటి వారిని వ్యాధిగ్రస్తులుగా చూసినట్లయితే త్వరగా మామూలు మనుషులుగా మారలేరని, వారికి ప్రత్యేకంగా ప్రతి విషయంపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్యురాలు లిదియా, ఎన్‌సీడీ పీఓ వినోద్ కుమార్, సిబ్బంది రాందాస్, సామ్యూల్ పాల్గొన్నారు.

తప్పుల తడక షమీం అక్తర్ నివేదిక



నవతెలంగాణ-వాంకిడి

ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్రంలో పర్యటించిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు షమీం అక్తర్ ప్రభుత్వానికి నివేదించిన రిపోర్టు తప్పుల తడకగా ఉందని, దానిని సవరించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ కమిషన్ సిద్ధం చేసిన నివేదికలో చాలా తప్పులు దొర్లాయని, ఏకపక్ష నిర్ణయంతో మాల, మహర్లకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కమిషన్ ఆదిలాబాద్‌కు వచ్చిన సందర్భంగా మాదిగలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మహర్, మాల సంఘాల నాయకులు ఇచ్చిన వినతులను పూర్తిగా స్వీకరించాలేదన్నారు. ఫిబ్రవరి నాలుగున రాష్ట్ర అసంబ్లీలో బిల్లును ఆమోదిస్తూ సోషల్ జస్టిస్ డేగా నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం షమీం అక్తర్ నివేదిక నకలు కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్, ఉపాధ్యక్షుడు దుర్గం హంసారాజ్, సమాజ అధ్యక్షుడు విలాస్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఉప్రే రోషన్, విజయ్, అరుణ్, దుర్గం దీపక్, డిలాజీ, మారుతి, ఇంద్రజిత్, రమేష్, నాగ్సేన్, ప్రదీప్, తిరుపతి, నూతన్, విఠల్, సందీప్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధికార కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి కోరారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో నాయకులతో కలిసి చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే వందరోజులలో అమలు చేస్తామని ప్రకటించిందని, అధికారంలోకి వచ్చి14 నెలలైనా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. హామీల అమలుకు పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై నిరసన తెలిపి అధికార కాంగ్రెస్ కళ్ళు తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు వీరన్న, బాబా, పులి శంకర్, పులి సురేష్, బాషు, గౌస్, పులి రవి, జాడి తుకారాం, విలాస్ పాల్గొన్నారు.



విజయవంతంగా ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లో నిర్వహించిన పదవ తరగతి టాలెంట్ టెస్ట్ విజయవంతమైందని జిల్లా కార్యదర్శి చాపిలె సాయిక్రిష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాగజ్‌నగర్ మండలంలో వివేకానంద జూనియర్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకి టాలెంట్ టెస్ట్ నిర్వహించామన్నారు. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టడంతో పాటు వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసం ఈ పరీక్షను ఉపయోగపడుతుందన్నారు. కాగజ్‌నగర్‌లో నిర్వహించిన పరీక్షలో వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి, జిల్లా కార్యదర్శి మహిపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు రక్షిత, ఝాన్సీరాణి, నాయకులు దీపక్, పవన్, యాకూబ్ పాషా, టీన, రిద, తేజస్విని, స్నికిత, జయ ప్రకాష్, వైభవ్ , ఉపాధ్యాయ సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిర్యాణి : మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు ముఖ్య అతిథిగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టికానంద్ హాజరై ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలిలి తీయడం, వారిలో ఉన్న భయాన్ని పోగొట్టడం, వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయడానికి పరీక్షలు దోహదపడుతాయన్నారు. వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని, భవిష్యత్ పునాదులకు విద్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు మంచి మార్గంలో నడవాలని, నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులన్నారు. కార్యక్రమంలో నాయకులు అనూష, భాస్కర్, సాయి, మనిషా, సంజీవ్ పాల్గొన్నారు.



నెట్‌వర్క్ వచ్చేదెప్పుడు.. పత్తి కొనేదెప్పుడు..

- వారం నుండి రైతుల పడిగాపులు
- పత్తి కొనేలా చూడాలని వేడుకోలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విత్తనాలు కొనుగోలు చేసినప్పటి నుండి పంట పండించి అమ్మే వరకు కూడా రైతు పంటకు అనుకున్న ధర వస్తుందా..? లేదా..? ఒకవేళ ధర వచ్చిన దిగుబడి ఉంటుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారుతున్న సమయంలో పత్తి పంట అమ్ముకునే సమయంలో నెట్‌వర్క్ పని చేయకపోవడంతో ప్రస్తుతం మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ప్రస్తుతం జిల్లాలోని రైతుల పరిస్థితి తయారైంది. జిన్నింగ్ మిల్లుల వద్ద వందలాది వాహనాలతో రైతులు పత్తి కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న సమయంలో ప్రత్యేక కథనం.

జిల్లాలో ఇది పరిస్థితి

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 3 లక్షల 30వేల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. 23 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని 17 జిన్నింగ్ మిల్లులలో పత్తి కొనుగోలు చేయడానికి సీసీఐ అధికారులు ఏర్పాట్లు చేయగా మద్దతు ధరను కూడా నిర్ణయించారు.

నెట్‌వర్క్ పనిచేయక రైతులకు ఇబ్బందులు

సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు చేయాలంటే "రాయిటెల్" నెట్‌వర్క్ ఉండాల్సి ఉంటుంది. సాంకేతిక లోపంతో వారం రోజుల నుండి నెట్‌వర్క్ పని చేయకపోవడంతో జిన్నింగ్ మిల్లులలో పత్తి కొనుగోలు నిలిపివేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

వారం రోజులుగా ఎదురుచూపులు



ఎప్పుడెప్పుడు నెట్వర్క్ వస్తుందో ఎప్పుడు పత్తి కొనుగోలు చేస్తారని రైతులు తమ పంటను వాహనాల్లో తీసుకువచ్చి జిన్నింగ్ మిల్లుల వద్ద వారం రోజుల నుండి ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పెట్టుబడి భారంగా మారిన సమయంలో ప్రస్తుతం రోజురోజుకు వాహనాల కిరాయి పెరుగుతూ మరింత ఇబ్బందిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నెట్‌వర్క్ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

దళారులకు పండగ

రాయిటెల్ నెట్‌వర్క్ పని చేయకపోవడంతో పత్తి కొనుగోలు నిలిచిపోయింది. అత్యవసరమైన రైతులు తీసుకువచ్చిన పత్తిని ఇంటికి తీసుకెళ్ళలేక అవసరానికి డబ్బులు దొరకక పడుతున్న ఇబ్బందులు దళారులకు పండుగగా మారింది. సీసీఐ కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. రైతుల ఇబ్బందులు దళారుల వరంగా మారాయి.

నెట్వర్క్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలి



దుర్గం దినకర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు.

వారం రోజులుగా నెట్వర్క్ పనిచేయకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులు తీర్చేలా చూడాలి. నెట్‌వర్క్ తిరిగి పనిచేసేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జిల్లాలోని గిరిజన రైతులకు అండగా నిలవాలి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని గోదావరి రోడ్డులో నివాసం ఉంటున్న లకావత్ గణేష్ అనుమానంతో భార్యను హత్య చేసినట్లు ఎస్ఐ పి సతీష్ కుమార్ తెలిపారు. అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో భార్య లకావత్ రాజకుమారి(40) మహిళను సొంత భర్త సిమెంటు ఇటుక, బండరాయితో కొట్టి చంపాడు. నిందితుడు రోజు మద్యం తాగి భార్యకు ఇతరులతో అక్రమ సంబంధం ఉందని కొడుతూ, తిడుతూ, చంపుతానని బెదిరించేవాడు. అదే క్రమంలో శనివారం రాత్రి భార్యతో గొడవప పడ్డాడు. భార్య ఆదివారం ఉదయం 3.30 గంటలకు బాత్రూమ్‌కు వెళ్లగా వెనకాలే వెళ్లి బాత్రూంలో సిమెంట్ ఇటుకతో తలపై కొట్టి చంపాడు. మృతురాలి తల్లి బుఖ్య రేణుకాబాయి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నిరుపయోగంగా ఓపెన్ జిమ్

● విరిగి పడిపోయిన పరికరాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని అమర ధామం పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది. గత ఆరేండ్ల క్రితం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పర్యవేక్షణ లేక పరికారులు విరిగిపోయాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కరువై స్థానికులకు ఉపయోగపడకుండా పోతోందని పలువురు పేర్కొంటున్నారు. జిమ్ ఏర్పాటు చేసిన కొత్తలో పురుషులు, మహిళలు వచ్చి వ్యాయామం చేసేవారని ప్రస్తుతం పిచ్చిమొక్కలు వెలిసి నిరాదారణకు గురవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో అసంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల 1993-96 బ్యాచ్‌లో చదివిన మైనింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 40 మంది పూర్వ విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులుగా ఉన్న రోజుల్లో కళాశాలలో జరిగిన మరపురాని సంఘటనలను మధురానుభూతులను కాలేజీ టైంలో జరిగిన విషయాలు నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. 30 సంవత్సరాల సుదూర విరామం తర్వాత కలిసిన స్నేహితులు ఆనందంగా ఆడి పాడారు ప్రస్తుత విద్యార్థులకు అనుభవ పూర్వక పాఠాలను తెలియజేశారు. చదువులో ఉన్నతంగా రాణించేందుకు చేయవలసిన కృషిని గురించి వివరించారు. విద్యార్థులకు చిరు కానుకలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్‌ను బోధన సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోయ తిరుపతి, జిల్లా న్యాయమూర్తి బోయ తిరుపతి, కె వేణు గోపాల స్వామి, కరీముల్లా ఖాన్, శ్రీరామ్ పాల్గొన్నారు.

ముగిసిన లయన్స్ క్లబ్ రీజియన్ మీట్



నవతెలంగాణ-జన్నారం

లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి రీజియన్-3 మీట్ కార్యక్రమం ఘనంగా ముగిసిందని లైన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని పైడిపల్లి గార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని లైన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ హెచ్. రాజి రెడ్డి పాల్గొని సమాజ సేవలో లయన్స్ క్లబ్ భాద్యతలపై ప్రసంగించారు. ప్రధాన వక్త డాక్టర్ బి సంతోష్ శర్మ లయన్స్ సేవా ప్రాముఖ్యత, నాయకత్వ నైపుణ్యాలపై విలువైన సందేశం అందించారు. విశిష్ట అతిథిగా జన్నారం ఎస్ఐ రాజా వర్ధన్ హాజరై సమాజ సేవలో లయన్స్ పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో రీజియన్ అడ్వైజర్ ఆర్. నారాయణ రెడ్డి, లేడీ లైన్ ఏనుగు రజితరెడ్డి, కార్యక్రమ కమిటీ చైర్మన్ హనుమంత్ రావు, సహ చైర్మన్ నూరాని, రీజియన్ సెక్రటరీ అనుముల రాజన్న, రీజియన్ ట్రెజరర్ పొన్కల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, జోన్ చైర్మన్‌లు అజుత రావు, కె వెంకటేశ్వర్లు, గుండ పవన్, సతీష్, జగదీష్, సందీప్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా సహకార అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించి, ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన దొండి సాయినాథ్‌ను ఆదివారం శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో ఎన్టీఆర్ మార్గ్ కాలనీ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మార్గ్ సొసైటీ అధ్యక్షులు భూసారపు గంగాధర్ మాట్లాడుతూ వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు లింగంపల్లి లక్ష్మీనారాయణ, సెక్రటరీ శివరాం వెంకటేష్, చిటిమల సదయ్య సోలాపూర్ రాజేశ్వర్, ఆడేపు సుధాకర్, సింగిడి భూషణ్‌రెడ్డి, పడిగెల వేణుగోపాల్, పోలిశెట్టి రాజు, ద్యాగలక్ష్మి రాజు, సంఘం మహేందర్, నాచం సతీష్, తోడిశెట్టి పరమేశ్వర్, శనిగారపు పోశెట్టి, సంఘం నరేందర్, ఆరేపల్లి రవీందర్ పాల్గొన్నారు.

సర్వేలో పాల్గొనని వారికోసం మరొక అవకాశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో, పలు కారణాల వల్ల 3శాతం ప్రజలు పాల్గొనలేక పోయారని ఈ నేపథ్యంలో సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల పేర్కొన్నారు. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు ఈ సర్వేను మళ్లీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వేలో ఇప్పటివరకు పాల్గొనని వారు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్వే సిబ్బంది తమ ప్రాంతానికి వచ్చినప్పుడు, తమ కుటుంబ వివరాలను సమగ్రంగా అందించాలన్నారు. ఈ సర్వే ద్వారా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం సరైన ప్రణాళికలు రూపొందించవచ్చని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని చెన్నూరు గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం ఎస్సై శంకర్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా జరుగుతుందని, అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం ఈ రెండు ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. వారి వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

జనాభాలో మైనార్టీగా ఉన్న అగ్రవర్ణ ప్రయోజనాల కోసమే నరేంద్ర మోడీ ప్రభుత్వం అగ్రవర్ణ రిజర్వేషన్లను తీసుకువచ్చిందని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు పేర్కొన్నారు. ఆదివారం సీసీసీ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన బీసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యవక్తగా హాజరయి ప్రసంగించారు. రేవంత్‌రెడ్డి సర్కారు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దుచేసి బీసీ రిజర్వేషన్లను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలు మెజారిటీగా ఉన్న ప్రాంతాల్లో బీసీలు ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా గెలుపొందే దశలో మంచిర్యాల జిల్లా ప్రజలు చైతన్యం కావాలని ఆయన పేర్కొన్నారు. బీసీ బిడ్డలు రాజ్యాధికారంలో కూర్చుని అగ్రవర్ణాలకు సీట్లు పంపిణీ చేసే రోజు రావాలని ఆయన కోరారు. మండల్ కమిషన్ సిఫారసు చేసిన అన్ని అంశాలను కేంద్ర ప్రభుత్వం అమలు పరచాలని డిమాండు చేశారు. మెజార్టీ వర్గం ఆకాంక్షలు నెరవేర్చడమే నిజమైన ప్రజాస్వామ్యమని ఆయన పేర్కొన్నారు. కులగణనని సత్వరం పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను, సామాజిక సంపదలో బీసీ వాటాను పెంచాలని సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం పేర్కొన్నారు. రాజ్యాంగం అందించిన హక్కులు నిలబడాలంటే బహుజన చైతన్యంతో ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మంచిర్యాల గడ్డపై బీసీ చైతన్యంతో ఉద్యమించాలని సమ్మేళనం నిర్వాహకులు ప్రజలకు పిలుపునిచ్చారు. పూలే అందించిన బహుజన చైతన్యాన్ని ప్రతి ఒక్కరూ పుణరంకితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, బీసీ సంఘాల నాయకులు గాండ్ల హరిప్రసాద్, తుల మధుసూధన్, కర్రె శ్రీధర్, రఘునందన్, గాజుల ముఖేష్ గౌడ్, బెల్లంకొండ మురళి, గంగధారి తిరుపతి పాల్గొన్నారు.

శిశువు మృతికి కారణమైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

● మత శిశు ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల నిరసన



నవతెలంగాణ-మంచిర్యాల

కడుపులోని శిశువు మృతికి కారకులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జిల్లా కేంద్రం లోని మాత శిశుఆస్పత్రి ఎదుట బాధితురాలి కుటుంబ సభ్యులు ధర్నా చేపట్టారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నెన్నెల కు చెందిన గావిడి సుమలతకు 9 నెలలు నిండడంతో ఫిబ్రవరి 12న మంచిర్యాల మాత శిశు ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. ఓపి సమయం అయిపోయిందని రేపు రావాలని సిబ్బంది తెలపడంతో మరుసటి రోజు గురువారం పరీక్షలకు వచ్చిన సుమలతను పరీక్షించిన వైద్యులు కడుపులోని శిశువు మృతి చెందినట్లు ఉందని కుటుంబ సభ్యులకు తెలిపి సాయంత్రం వరకు సుమలతకు చికిత్స అందించి మృతి చెందిన ఆడ శిశువును తమకు అందించినట్లు తెలిపారు. డెలివరీ కోసమని ఒక రోజు ముందు ఆస్పత్రికి వచ్చినప్పటికి ఎటువంటి పరీక్షలు చేయకుండానే డాక్టర్‌లు లేరని గర్భిణీని అడ్మిట్ చేసుకోకుండా ఇంటికి పంపించడం తోనె కడుపులోని శిశువు మృతి చెందినట్లు తెలిపారు. శిశువు మృతికి కారణం అయినా వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సుమలత భర్త రాజన్నతో పాటు కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడిన సంబంధిత అధికారుల హామీతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, కమిటీ సభ్యులు బోడెంకి చందు, ఐఆర్‌సీపీ నాయకులు కామిళ్ల జయరావు, ఎర్మా పున్నం, గిరిజన సంఘం నాయకులు మరమాల శంకర్, బండారి రాజేశ్వరీ, నాగజ్యోతి పాల్గొన్నారు.

ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ రావును కలిసిన బీఎంఎస్ నాయకులు



నవతెలంగాణ-జైపూర్

డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమీషనర్ ఎదుట కుదుర్చుకున్న ఒప్పందాలు అమలు చేయాలని బీఎంఎస్ నాయకులు కోరారు. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కార్మికులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో భాగంగా వారి హక్కులు అమల్లోకి తీసుకురావాలని బీఎంఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్లాంట్ అనుబంధ బీఎంఎస్ యూనియన్ నాయకులతో కలిసి అధ్యక్షులు యాదగిరి సత్తయ్య యాదవ్ ఇటీవల ఎస్టీపీపీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్(ఈడీ) రాజశేఖర్‌రావును కలిసి ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. 2024 డిసెంబర్ 17న హైదరాబాద్ డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమీషనర్ ఎదుట కుదిరిన ఒప్పందం ప్రకారం ఎస్టీపీపీలో క్యాంటిన్ పున:ప్రారంబించినప్పటికీ సబ్సీడీ రేటుతో క్యాటీన్ కొనసాగించాలని కోరారు. అదే విధంగా ఎస్టీపీపీ విస్తరణలో భాగంగా భూములు నష్టపోయిన కుటుంబాల వారి అర్హతకు అనుగుణంగా ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా యోగ్యతకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బస్సు సౌకర్యం కల్పించడానికి నిర్ణయం తీసుకుంటామని, ఐదు సంవత్సరాల సీనియార్టి కలిగిన వారికి పదోన్నతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని ఎస్టీపీపీ ఈడీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. విధిలో ఉండి ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల్లో ఒక్కరికి సూటెబుల్ జాబ్ ఇవ్వడానికి అంగీకరించడంతో పాటు హామీలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు పేర్కొన్నారు.

18న గ్రామీణ వైద్యుల చలో హైదరాబాద్



తెలంగాణ-తాండూర్

ఈ నెల 18న హైదరాబాదులో నిర్వహించే గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభకు జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీ అనుభవ వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల రవి తెలిపారు. ఆదివారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో మాట్లాడారు. 2009లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రంలోని ఆర్ఎంపి వైద్యులకు తగు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు కూడా అందజేశారని తెలిపారు. గ్రామీణ వైద్యులకు కనీస గుర్తింపు కూడా లేకుండా పోయిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాపాల సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పీఎంపీ, ఆర్ఎంపివైద్యుల వృత్తిపరమైన శిక్షణ ఇచ్చి తగు గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు. ఆత్మగౌరవ సభకు జిల్లా నలుమూలల నుంచి ఆర్ఎంపీ, పీఎంపీలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సభకు ఎమ్మెల్సీలు ఎం కోదండరాం, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యుల సంఘం జిల్లా సీనియర్ నాయకులు డాక్టర్ సజ్జనపు బ్రహ్మానందం, లక్ష్మణచారి, నాయకులు జూపాక బానేష్, పోలు శ్రీనివాస్, పెండెం కనకయ్య, దశరథం, ఎం శ్రీనివాస్, భూపతి రాజు, రాజేష్ పాల్గొన్నారు.

బట్వాన్‌పల్లిలో అగ్నిప్రమాదం

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో ఇడిగిరాల భీమయ్య అనే కూలీకి చెందిన పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో పెంకుటింట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటల్లో ఇంట్లోని వస్తువులు, నిత్యవసర సరుకులు, దుస్తులతో పాటు 2 తులాల బంగారు ఆభరణాలు, రూ.80 వేల నగదు, భీమయ్య కుమారుడు మహేష్‌కు సంబంధించిన డిగ్రీ సర్టిఫికెట్లు కాలి బూడిదయ్యాయి. ప్రమాద స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటన బాధితుడు భీమయ్య కుటుంబంలో విషాదం నింపింది. ప్రభుత్వం తనకున్న నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని భీమయ్య వేడుకున్నారు. సంఘటన స్థలాన్ని ఎంపీడీఓ మహేందర్, ఆర్ఐ మురళీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శి అల్లావుద్దీన్ సందర్శించి బాధితులను పరామర్శించారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ, 30 సంవత్సరాల కల కాంగ్రెస్ ప్రభుత్వంతో సాధ్యం అయిందన్నారు. ఎస్సీ కేటగిరీలో ఎవరి జనాభా ఎంతో, వారి వాటా అంత ఇది సామజిక న్యాయం అని, ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా పోరాటం చేస్తే ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు అన్నారు. యావత్ తెలంగాణ మాదిగ జాతి రుణపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ ఖాన్, టౌన్ ప్రెసిడెంట్ దూమల్ల రమేష్, ఎస్సి సెల్ అధ్యక్షుడు మామిడిపెల్లి ఇందయ్య ఏఎంసీ డైరెక్టర్ రేగుంట ప్రదీప్, జిలకర గంగన్న, దూమల్ల ప్రవీణ్, చంద్రయ్య, ఈర్నాళ్ళ గంగన్న, జిలకర నర్సయ్య, సుద్దాల వెంకటస్వామి, వెంకటేష్, గోల్కొండ శ్రీనివాస్, వినయ్, రాజకుమార్, జై కుమార్, ఐలవేణి శ్రీను పాల్గొన్నారు

యోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో వెలుగొందాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఆదివారం సీసీసీ పోలీస్‌స్టేషన్ ఎదురుగా శ్రీకృష్ణ పిఠాధిపతి శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ కాలచక్రం, శ్రీ వైష్ణవ అయుత చండి, అతిరుద్రం, శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 86వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో ఎమ్మెల్యే తన కుమారుడు కొక్కిరాల ఉదయ్ చరణ్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ స్వామి వారి ఆశీస్సులతో మంచిర్యాల నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని పిఠాధిపతులు ఇలాంటి యజ్ఞాలు చేస్తున్నారని తెలిపారు. కుల మతాలకతీతంగా జరుగు ఈ కార్యక్రమానికి భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని మహా యజ్ఞాన్ని దిగ్విజయం చేసి సంపూర్ణ యాగఫలితాన్ని పొందాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును అర్చకులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1999-20 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చదువులు చెప్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి ఆశీస్సులు పొందారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము చెప్పిన చదువులతో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానంలో ఉన్నారని, ఇదీ గొప్పగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : మండలంలోని బోరిగామ ప్రభుత్వ పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఎక్కడెక్కడో స్థిర పడి రెండు దశాబ్దాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ చిన్ననాటి స్మృతులను నెమరేసుకున్నారు. ముందుగా పూర్వ విద్యార్థులు తమకు విద్యను బోధించిన నాటి ఉపాధ్యాయులను శాలువలతో ఘనంగా సన్మానించారు.



5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

ఎమ్మెల్సీ అభ్యర్థిని సన్మానించిన శ్రీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కాంగ్రెస్ ఉమ్మడి ఆదిలాబాద్-కరీంనగర్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి "ఆల్ఫోర్స్" వి.నరేందర్ రెడ్డిని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సన్మానించారు. ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను మర్యా పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగిన సీఈఓ పరీక్షలు

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని లాల్‌టెక్డి ప్రభుత్వ గిరిజన గురుకుల కళాశాలలో కాలేజ్ ఆఫ్ ఎక్సలేన్స్(సీఈఓ) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కేంద్రాన్ని గిరిజన గురుకుల ఆర్‌సీఓ అగస్థయన్ ఆదివారం పరిశీలించారు. 320 మందికి 304 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు.

కులం గురించి అడిగే హక్కు బీజేపీకి లేదు

- త్యాగం అనే కులంలో రాహుల్ గాంధీ పుట్టాడు
- కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం
- మంత్రి సీతక్క



ఆదిలాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



నిర్మల్ : సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మోదీ బీసీ కాదన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కొందరు బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ కులమేంటని అడుగుతున్నారన్నారని, దేశ కోసం సర్వం త్యాగం చేసిన మోతీలాల్ నెహ్రూ కుటుంబం నుంచి వచ్చిన నాయకుడు రాహుల్ గాంధీ అని మంత్రి సీతక్క అన్నారు. రాహుల్ గాంధీ కులం గురించి అడిగే హక్కు బీజేపీకి లేదన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సభకు కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. సీతక్క మాట్లాడుతూ 11 సంవత్సరాలు అధికారంలో ఉండి ఏం చేసారో చెప్పాలని ప్రశ్నించారు. ఇక్కడ ఎంపీ గెలిచినా, ఎమ్మెల్యే గెలిచినా, ఆదిలాబాద్ కోసం ఏం తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ జరిగిందని రైతు భరోసా పడుతుందన్నారు. ఫ్రీ బస్ నడుస్తుందని, రూ.500లకే గ్యాస్ ఇస్తున్నామని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నరేందర్ రెడ్డిని గెలిపించాలన్నారు.

యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి..

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేను ఇప్పటికే ఇక్కడికి ఒక సారి వచ్చి కొన్ని సామాజిక సేవలు చేసినట్టు వివరించారు. లైబ్రరీలో కాంపెటీటివ్ ఎక్జామ్‌కు ప్రిపేరయ్యే అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం అందించే విధంగా సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఇక్కడ ఒక యూనివర్సిటి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల్ చారి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ, కరీంనగర్ గ్రంథాలయ చైర్మెన్ సత్తు మల్లేష్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు భూపెల్లి శ్రీధర్, ఆత్రం సుగుణ, పార్లమెంట్ కోఆర్డినేటర్ నరేష్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నిర్మల్‌రూరల్ : కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్‌లోని చంద్రశేఖర్ కన్వెన్షన్ హాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ఓటరు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించాలని అన్నారు. గత దశాబ్ద కాలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం లక్ష ఉద్యోగాలు ఇవ్వలేక పోయినా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సంవత్సరంలోపే దాదాపు 53వేల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌లు గానీ, ట్రాన్స్‌ఫర్‌లకు సరైన పరిష్కారం చూపించామని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న 33 జిల్లాల్లో ఉన్న ప్రతీ యూనివర్సిటీ గురించి, మెడికల్ కాలేజీల గురించి తెలుసునని అన్నారు. నిరుద్యోగులకు లైబ్రరీల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించి, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ కూడా అందించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎన్నికలలో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండే విఠల్, వేణుగోపాలచారి, వెడ్మ బొజ్జు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ : సమావేశంలో పాల్గొన్న నాయకులు, పట్టభద్రులు

ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పున: సమీక్షించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పున: సమీక్షించాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ మంత్రి సీతక్కకు విన్నవించారు. ఆదివారం పట్ట భద్రుల ఎమ్మెల్సీ సభకు హజరైన మంత్రి సీతక్క వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014 నుంచి 2024 వరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, విద్యా, ఉద్యోగం, స్వయం ఉపాధి, దళితబంధు, దళితబస్తీ, రాజకీయ, అన్ని రంగాలలో మాల, మాల ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణను పున: సమీక్షించాలని అన్నారు. 2024 జనాభా లెక్కల ప్రకారం మాలలకు న్యాం జరిగే విధంగా ఎంపారికల్ డాటా సేకరించి రాజ్యాంగ బద్ధంగా వర్గీకరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల మల్లన్న, బేర దేవన్న, సింగరి అశోక్, సూరం భగవాండ్లు, దాసరి బాబన్న, తొగరి ప్రకాష్, పాశం రఘువేంద్ర పాల్గొన్నారు.

రోగులకు ఉచితంగా మినరల్ వాటర్

- ఉత్తమ సేవలకు చిరునామా లయన్స్ కంటి ఆస్పత్రి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రి అంటే తెలియని వారు ఉండరు. లయన్స్ కంటి ఆసుపత్రి ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందింది. అలాగే కంటి ఆసుపత్రికి కంటి రుగ్మతలతో చేరుతున్న రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందుతోంది. అంతేకాకుండా రోగుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే ధ్యేయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పి వారికి ఉచితంగా మినరల్ వాటర్‌ను అందిస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన రోగులకు ప్రతి ఒక్కరికీ ఒక లీటర్ మినరల్ వాటర్, బ్రేక్ ఫాస్ట్ సమయంలో అరలీటరు మినరల్ వాటర్ అందించే సౌకర్యం కల్పించారు లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు బసవేశ్వరరావు. అలాగే రోగులకు ఉత్తమ వైద్య సేవలందించేందుకు త్వరలో ఆరోగ్యశ్రీని అమలు చేయనున్నట్లు బసవేశ్వరరావు తెలిపారు.

సీడబ్ల్యూసీ గోదాముల్లో సెన్సార్‌లతో నిఘా

నవతెలంగాణ-బోధన్

చౌక ధరల దుకాణాలకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం పక్కదారి పట్టకుండా ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సిడబ్ల్యుసి గోదాములలో సెన్సార్ పరికరాల బిగంపుకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా బోధన్ పట్టణంలోని సిడబ్ల్యుసి గోదాంలో గత రెండు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వచ్చిన సాంకేతిక నిపుణుల బృందం మూడు గోదాములలో సెన్సార్లను ఏర్పాటు చేశారు. దీనివలన గోదాంలోని బియ్యం బయటకు పోయినప్పుడు కానీ, గోదాంలో ప్రవేశించిన వారిని సెన్సార్‌లు రికార్డు చేస్తాయి. ప్రతి గోదాంలో మాస్టర్ కీగా పిలవబడే మోడేంలు బిగించారు. ఇవి వీటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన సెన్సార్‌లను ఎప్పటికప్పుడు పనిచేసేలా చూస్తాయని టెక్నీషియన్‌లు తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన టెక్నీషియన్‌లు వీటి నిర్వహణపై సీడబ్ల్యూసీ అధికారులకు వివరించి అవగాహన కల్పించారు.

సీడీసీ చైర్మన్‌కు క్లాస్‌మెట్స్ సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని ఆదివారం పదవ తరగతి 1995-1996 బ్యాచ్ క్లాస్‌మెట్స్ సిడిసి చైర్మన్ మహమ్మద్ ఇర్షాదుద్దీన్‌ను సన్మానించినట్టు తెలిపారు. స్నేహితులు పూలమాలతో సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా క్లాస్‌మెట్స్ మాట్లాడుతూ.. తమ మిత్రునికి సిడిసి చైర్మన్ పదవీ రావడం వలన అందరూ సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆశీర్వదించారు.

అ'పూర్వ' విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1998-99 విద్యా సంవత్సరపు 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. గురువులకు శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఒకే బడిలో చదివిన వారంతా 25 సంవత్సరాల తర్వాత ఒకే వేదికను పంచుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో గురువులు వెంకట్‌గౌడ్, హనుమంత్‌రెడ్డి, దత్తయ్య, విద్యార్థులు సలాం, కటిక రాజు, బండి లింగం, బొమ్మిడి దయాకర్‌రెడ్డి, ఓరుగంటి రవి, వడ్ల సురేష్, గజ్జల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను విజయవంతం చేద్దాం

నవతెలంగాణ-రామారెడ్డి

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి సంరక్షించాలని మండల ఇన్చార్జ్ పాల మల్లేష్ సూచించారు. ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు జీర్ల సత్యనారాయణ, జీర్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు కాపాడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు కాపాడాలని కార్మికులపై వేధింపులు పనిభారాలు మానుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి కె.ఎస్ రెడ్డి, రీజనల్ కార్యదర్శి ఎం.భీమ్‌రావు అన్నారు. ఆదివారం ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ ఆదిలాబాద్ రీజియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఆర్టీసీ సంస్థలో కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలు సంస్థలో వస్తున్న మార్పులపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి డిపోలో కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఓవైపు కిలోమీటర్ల పెంపూ, ఓటీలు తగ్గింపు డిపోలలో సరిపోయినంత కార్మికులు లేక రిక్రూట్మెంట్ లేక, విరామం లేకుండా, బలవంతంగా డబుల్ డ్యూటీలు చేస్తూ కార్మికులు అనారోగ్యం పాలైన శుభ అశుభ కార్యక్రమాలకు ఒక్కరోజు లీవ్ దొరకని పరిస్థితులు ఉన్నాయన్నారు. మరోపక్క ఈ పీకే పేరుతో కండక్టర్లను కేఎంపీఎల్ పేరుతో డ్రైవర్లను నిత్యం వేధింపులు మామూలైందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫేమ్ స్కీం కింద ఇస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలకు ఇవ్వకుండా ప్రయివేట్ సంస్థలకు ఇస్తూ సబ్సిడీలను కూడా వారికి ఇవ్వడం అంటే ప్రయివేటీకరణను ప్రోత్సహించడమే అన్నారు. ఈ సమస్యలు సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ నిర్మాణం కోసం అన్ని రీజియన్లలో పర్యటించి, కార్మికులను చైతన్యం చేయడం కోసమే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు అశోక్, సురేష్, నారాయణ, దత్తు, అనిల్ కుమార్, వెంకటేష్, దేవన్న, ఎస్ నారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-లింగంపేట్

త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ప్రచారం నిర్వహించి.. ప్రతి ఓటర్ దగ్గరకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నుంచి 55 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ దగ్గరికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త గ్రామ కమిటీ అధ్యక్షులు కష్టపడి పనిచేసి భారీ మెజార్టీని తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, మండల యూత్ అధ్యక్షులు రాజు, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఎల్లమయ్య, భాస్కర్ గౌడ్, అశోక్, బైరయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్, నాయకులు కౌడ రవి, కాసిం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి యువజన సంఘాల సమావేశం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో గ్రంథాలయ భవనం నిర్మించేందుకు యువజన సంఘాల సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. నిరుద్యోగ యువత పలు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఎంతగానో ఉపయోగపడతాయనే ఉద్దేశ్యంతో గ్రామంలోని భవన నిర్మాణం కోసం ఖాళీ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చారని, వారి సహాయ సహకారాలతో రాజకీయాలకు అతీతంగా భవన నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు యువజన సంఘాల సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై చర్చా గోష్ఠి

- శ్రామిక వర్గానికి నిధులు పెంచాలి
- తెలంగాణకు ద్రోహం చేసినందుకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- ప్రజా సంఘాల డిమాండ్

నవతెలంగాణ-వర్ని

పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను సవరించి.. మార్పులు, చేర్పులు చేసి, శ్రామిక వర్గానికి నిధులు పెంచాలని ప్రజా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వర్ని మండల కేంద్రంలో తెలంగాణకు ద్రోహం - బడా బాబులకు భోజ్యం అనే అంశంపై కేంద్ర బడ్జెట్ మీద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చర్చ-గోష్ఠి నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. నిజామాబాదులో జాతీయ పసుపు బోర్డుకు నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. బోధన్ నుంచి బీదర్ వరకు రైల్వే లైన్ చర్చ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జక్రాన్‌పల్లిలో విమానాశ్రయానికి నిధులు ఇవ్వలేదని అన్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీ ఊసే ఎత్తలేదని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ద్రోహం చేసినందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చర్చ గోష్ఠిలో సీఐటీయూ, గ్రామపంచాయతీ యూనియన్, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, అంగన్‌వాడీ యూనియన్, పలు యూనియన్‌ల నాయకులు నన్నేసాబ్, సాయిలు, లింగం, మల్లేష్, జీశాన్, అలీపాషా, సురేష్, సాయిలు, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీలకు రూ.13,650 వేతనం ఇవ్వాలి..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల పనుల్లో భాగంగా పని చేస్తూ ప్రభుత్వాలకు ఆసరాగా అంగన్వాడీ టీచర్లు ఉంటున్నారని అంగన్వాడీ టీచర్ డివిజన్ యూనియన్ అధ్యక్షురాలు మంగ దేవి అన్నారు. బడ్జెట్‌పై చర్చాగోష్ఠిలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ టీచర్లకు పలు ప్రభుత్వ పనులను చేయిస్తూ పనిభారం పెంచుతుందని అన్నారు. చాలీచాలని వేతనాలకు పనిచేస్తూ అంగన్వాడీ టీచర్లు బాధలు దిగమింగుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం గతంలో మూడు నెలలు మాత్రమే రూ.13,650 వేతనాలు ఇచ్చిందని, ఇప్పటికీ మళ్ళీ పాత వేతనాలు రూ.7,800 చెల్లిస్తూ కాలం వెల్లదీస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మళ్ళీ పార్లమెంట్ సమావేశాలలో మినీ అంగన్వాడీ టీచర్లకు రూ.13,650 వేతనాలు ఇచ్చేలా బడ్జెట్ పెంచాలని జిల్లా నాయకుల దృష్టికి తెచ్చారు. లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు పోరాటం చేస్తారని హెచ్చరించారు. దీనికి జిల్లా నాయకులు రమేష్ బాబు స్పందిస్తూ తప్పకుండా అంగన్వాడీ టీచర్ల వేతనాలపై ప్రభుత్వాల మెడలు వంచి పెంచిన వేతనాలు ఇచ్చేలా టీచర్లతో కలసి ప్రభుత్వాలకు తెలుపుతామని ఆయన తెలిపారు.

ఏసీ బస్సులలో 10శాతం ఫ్లాట్ తగ్గింపు

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బెంగుళూరు ఏసీ బస్సుల బేసిక్ టికెట్ చార్జీపై 10 శాతం రాయితీ ప్రకటించింది. ఈ రాయితీ ఏసీ స్లీపర్, ఏసీ సీటర్, రాజధాని బస్సులకు వర్తిస్తుందని నిజామాబాదు రీజినల్ మేనేజర్ టి. జోస్నా ఆదివారం తెలిపారు. ప్రయాణీకులకు ఉన్నత స్థాయి ప్రయాణాన్ని మరింత అందుబాటులో ఉంచడం, సౌకర్యవంతంగా చేయడం లక్ష్యంగా ఈ అవకాశం ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 10 శాతం తగ్గింపు టికెట్ చార్జీతో చౌకైన, సురక్షిత సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని కోరారు. ఈ తగ్గింపు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అన్ని ఏసీ బస్సుల ద్వారా అందుబాటులో ఉన్న హైదరాబాద్ నుంచి బెంగుళూరు రూట్లలో వర్తిస్తుందని, మరిన్ని వివరాలకు ముందస్తు రిజర్వేషన్ కోసం సంస్థ వెబ్‌సైట్ ఋఋ.ౡంతీ్ు౧ంఱ.ఱఅ ద్వారా లేదా సమీప బస్సు రిజర్వేషన్ కౌంటర్ నందు కూడా టిక్కెట్ బుక్ చేసుకునే సౌకర్యం కలదని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

భిక్కనూర్ : మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ప్రమోద్ మరణించిన విషయాన్ని తెలుసుకుని గ్రామ యువకులు ముందుకు వచ్చి రూ.3వేలు ఆర్థిక సహాయాన్ని, 25 కిలోల బియ్యాన్ని కుటుంబీకులకు అందజేశారు. భవిష్యత్తులో ప్రమోద్ పిల్లల చదువులకు సహాయం చేస్తామని గ్రామ యువకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు వంశీరెడ్డి, పవన్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, సంకీర్తన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులున్నారు.

విద్యార్థులకు టీషర్ట్‌లు పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని కుర్నపల్లి గ్రామానికి చెందిన గాంధారి హనుమంతరెడ్డి అని యువ నాయకులు స్థానిక ఉన్నత పాఠశాలలోని సుమారు 120 మంది విద్యార్థులకు క్రీడా టీ షర్ట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ సంజయ్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొండెంగల బెడద

నవతెలంగాణ-బోధన్

అడవుల్లో తిరగవలసిన కొండెంగలు నేడు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా సాలూర గ్రామంలో కొండెంగలు అధికంగా సంచరిస్తుండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం పాఠశాల విద్యార్థికి కొండెంగ దాడిచేసి గాయపరిచినట్లు సమాచారం. పాఠశాల ఆవరణలో పెరిగిన చెట్లను విరిచివేస్తు, ఇండ్లపై గెంతుతూ ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి. కావున అధికారులు తక్షణమే స్పందించి కొండెంగలను పట్టుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.